## చామంతి

చామంతి శీతాకాలంలో పూస్తుంది. సాగులో వున్న చామంతి రకాలను నక్షత్ర చామంతి(చిన్నపూలు), పట్నం చామంతి (మధ్యస్థపూలు) మరియు పెద్ద సైజు పూలు గలవిగా విభజించవచ్చు.

**రకాలు**

**పసుపు పూల రకాలు :** భసంతి, కో–1, ఎల్లోగోల్డ్, రాయచూర్ మరియు సిల్వర్(హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో సాగుచేసే రకాలు)

**తెలుపు పూల రకాలు :** రత్లామ్ సెలక్షన్, బగ్గి, ఐ.ఐ.హెచ్.ఆర్–6

**ఎరుపు పూల రకాలు :** రెడ్ గోల్డ్, కో–2

**వాతావరణ మరియు నాటే సమయం :** చామంతి మొక్కలు పగటి సమయం ఎక్కువగా వున్నపుడు శాఖీయంగా మాత్రమే పెరుగుతాయి. పగటి సమయం తక్కువగా వుండి రాత్రి సమయం ఎక్కువగా వుంటే చామంతిలో పూత బాగా ఏర్పడుతుంది. అందు కొరకు జూన్–జూలై మాసాల్లో నారు మొక్కలను నాటినట్లయితే నవంబర్–డిసెంబర్ మాసాల్లో పూస్తాయి.

**నేలలు :** తేలిక పాటి నేలలు అనుకూలం. ఉదజని సూచి 6.5–7 మధ్య వుండాలి. మురుగు నీటి పారుదల సరిగా లేని ఎడల మొక్కలు చనిపోతాయి.

**ప్రవర్ధనం :** పిలకలు మరియు కొమ్మ కత్తిరింపుల ద్వారా ప్రవర్ధనం చేస్తారు. పూల కోతలు అయిన పిమ్మట ఫిబ్రవరి–మార్చి నెలలందు మొక్కల నుంచి పిలకలను కత్తిరించి నారుమడిలో నాటుకోవాలి. మొక్కలని కొమ్మ కత్తిరింపుల ద్వారా ప్రవర్ధనం చేసుకుంటే మొక్కలు ఆరోగ్యంగా వుండి పూల నాణ్యత బాగుంటుంది. వేర్లు తొడిగిన పిలకల్ని జూన్, జులైలో నాటుకోవాలి.

**నాటటం మరియు ఎరువులు :** మొక్కలను 30×20 సెం.మీ. ఎడంగా నాటుకోవాలి. ఎకరాకు 55,000 నుండి 60,000 మొక్కలు అవసరమవుతాయి. నాటుటకు ముందు ఒక ఎకరాకు 10 టన్నుల పశువుల ఎరువు, 60–80 కిలోల నత్రజని, 30–40 కిలోల భాస్వరం మరియు 60–80 కిలోల పొటాష్ వేసుకోవాలి.

**నీటి యాజమాన్యం :** నాటిన మొదటి నెలలో వారానికి 2–3సార్లు, అటు పిమ్మట వారానికి ఒక తడి యివ్వాలి.

**ఊత మివ్వటం :** చామంతి  మొక్కలు వంగి పోకుండా వెదురు కర్రతో ఊతమివ్వడం మంచిది.

**దిగుబడి :** నారు నాటిన తర్వాత షుమారు నెల రోజులకు చామంతి మొక్కల తలలను త్రుంచి వేయడం వలన ప్రక్క కొమ్మలు ఏర్పడి అధిక పూల దిగుబడి పొందవచ్చు. ఒక్కొక్క మొక్క నుంచి 75–120 పూలను పొందవచ్చు.

**తలలు తుంచటం(పించింగు) :** నారు నాటిన నాలుగు వారాల తరువాత చామంతి మొక్కల తలలను తుంచి వేయాలి. ఈ విధంగా చేయడం వలన నిలువు పెరుగుదల ఆగి ప్రక్క కొమ్మలు ఎక్కువగా వస్తాయి. దీని వలన పూల దిగుబడి అధికంగా వస్తుంది మరియు పంట కూడా కొంత ఆలస్యంగా వస్తుంది.

**హార్మోన్ల వాడకం :** 100 పి.పి.యమ్(100 మి.గ్రా. లను లీ.నీటిలో) నాఫ్థలిన్ ఎసిటిక్ ఆమ్లాన్ని మొగ్గదశ కంటే ముందుగా పిచికారి చేస్తే పూతను కొంత ఆలస్యం చేయవచ్చు. 100–150 పి.పి.యమ్ జిబ్బరిలిక్ ఆమ్లాన్ని పిచికారి చేస్తే 15–20 రోజుల్లో త్వరగా పూతకొస్తుంది.

**పూలకోత :** జూన్-జూలై నాటిన మొక్కలు డిసెంబరు మరియు జనవరి వరకు పూతపూసి కోతకొస్తాయి. ఒక పంట కాలంలో దాదాపు 10-15 సార్లు పూలు కోయవచ్చు. ఎకరాకు దాదాపు 5 నుంచి 8 టన్నుల దిగుబడి వస్తుంది.

పూల కోత తరువాత చామంతి మొక్కలను నేలకు దగ్గరగా కత్తిరించినట్టయితే కత్తిరించిన భాగం నుంచి పిలకలు వచ్చి వాటిని మరలా నాటుకోడానికి ఉపయోగపడతాయి. పిలకల పెరుగుదలకు పైపాటుగా పశువుల ఎరువు, సూపర్ ఫాస్ఫేట్ వేయవలసి ఉంటుంది. అలా కాకుండా పంట తీసేసే ముందు కొమ్మ కత్తిరింపులను తీసుకొని నారుమడిలో పెట్టుకోవచ్చు. నారుమడిలో పెట్టే ముందర కొమ్మ కత్తిరింపులకు కార్బండైజిమ్ 1గ్రాము ఒక లీటరు నీటిలో కలిపిన ద్రావణంలో ముంచి నారుమడిలో నాటుకోవాలి. కత్తిరింపులకు వేర్లు బాగా రావాలంటే IBA 2500 PPM ద్రావణంలో కాని సెరాటిక్స్‌లో కాని ముంచి నారుమడిలో నాటుకోవాలి.

**సస్యరక్షణ :** చామంతి పంటకు ముఖ్యంగా పచ్చ పురుగులు, ముడత మరియు ఆకు తొలుచు పురుగు ఎక్కువగా నష్టం కలుగచేస్తాయి.

**పచ్చపురుగు :** ఈ గొంగళి పురుగులు ఆకులను తినివేయుటే కాక పువ్వులను కూడా పాడుచేస్తాయి. నివారణకు మలాథియాన్ 5శాతం పొడి 8 కిలోలను గాని లేక క్వినాల్‌ఫాస్ పొడి 8 కిలోలు ఎకరం విస్తీర్ణంలో చల్లుకోవాలి. లేదా ఎండోసల్ఫాన్ 2 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకొని నివారించవచ్చు.

**త్రిప్పు :** ఇవి గుంపులు గుంపులుగా చేరి రసాన్ని పీల్చివేయడం వల్ల ఆకులు ముడతలు పడి ఎండిపోతాయి. పూలు కూడ వాడిపోతాయి. నివారణకు డైమిథోయేట్ 1.5మి.లీ. లేక కార్బరిల్ 50% పొడిని 3 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**తెగుళ్ళు**

**ఆకుమచ్చ :** నల్లటి లోతైన గుండ్రటి మచ్చలు ఆకులపై ఏర్పడటం వల్ల ఆకులు ఎండి వడలిపోతాయి. నివారణకు మాంకోజెబ్ 3గ్రా. లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి.

**వేరుకుళ్ళు తెగులు:** మొక్కలు అకస్మాత్తుగా వడలిపోతాయి. భూమిలో నాటిన కటింగ్‌లు క్రుళ్ళిపోతాయి. దీని నివారణకు మురుగునీరు నిలువకుండ ఏర్పాటు చేయాలి. బ్లైటాక్స్ 3గ్రా. లేదా కాప్టాన్ 2.5-3గ్రా.లీటరు నీటిలో కలిపిన మందుతో నేలను బాగా తడిపి తెగులును అరికట్టవచ్చు.